క్లుప్తంగా

సన్మానం



చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలోని ఎంఈఓ సరళను ఉపాధ్యాయులు మంగళవారం శాలువాతో సన్మానించారు. సరళ కాంప్లెక్స్ హెచ్ఎంగా సమర్థవంతంగా విధులు నిర్వహించి ఎంఈఓగా ఉద్యోగోన్నతి పొందడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరచారి, జగన్‌మోహన్, వెంకటేశ్వర్‌రావు, అశోక్, భిక్షపతి, శైలజ, అనిత, సరిత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నెక్కొండ: మండల కేంద్రంలోని రైల్వేపై ఓవర్ బ్రిడ్జి (ఎరుకలవాడ) వద్ద గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందాడని మంగళవారం ఎస్సై మహేందర్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. యాచకుడిగా గుర్తించినట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె..



వర్ధన్నపేట: విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన మంగళవారం శ్రీరామోజీ కుమ్మరిగూడెం తండాలో చోటుచేసుకుంది. రామోజీ కుమ్మరిగూడెం తండాకు చెందిన రైతు భూక్యా శంకర్ తన వ్యవసాయ బావి వద్ద పాడి గేదెను మేతకు వదిలాడు. మేసుకుంటూ తెగి కింద పడిన విద్యుత్ తీగను తాకింది. విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని శంకర్ కోరాడు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

గీసుకొండ : మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారి మీద కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆర్చ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చంద్రశేఖర్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టిందని స్థానికుల ద్వారా తెలిసింది. ప్రమాదంలో గాయపడిన చంద్రశేఖర్‌ను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు మాజీ ఎంపీటీసీ బండి అనూష భర్త రాజబాబు అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆస్పత్రిలో మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆరెగూడెంలో ఇటీవల మృతి చెందిన వరికేల కరుణాకర్ కుటుంబాన్ని దయాకర్‌రావు పరామర్శించారు.

నివాళి



వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణ పరిధిలోని డీసీ తండాలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ అమ్మమ్మ మాలోతు ముత్యాలి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే నాగరాజు మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొని ఓదార్చారు.

రేపు సీతక్క రాక



పర్వతగిరి : రేపు (3వ తేదీ) మండలంలో సీతక్క పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 3వ తేదీన పలు అభివృద్ధి పనులను మంత్రి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ప్రారంభిస్తారని చెప్పారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని శ్రేణులను కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సింగులాల్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, ఎస్సీ సెల్ మండల నాయకులు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన ఏర్పాటు ఎప్పుడో..?

● నిధులు విడుదల చేసి రెండేళ్లు

నర్సంపేట రూరల్ : పట్టణంలో బస్తీ దవాఖాన ఎప్పుడు ఏర్పాటు చేస్తారు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పేదలకు మరింత మెరుగైనా వైద్యసేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం నర్సంపేట మున్సిపాల్టీ పరిధిలో బస్తీ దవాఖానా మంజూరు చేసింది. నిధులను సైతం విడుదల చేసినా స్థలం కేటాయించకపోవడంతో ఏర్పాటుకు నోచుకోలేదు. నర్సంపేటలోని మున్సిపాల్టీ పరిధిలో సుమారు 45 వేల జనాభా ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి. అయితే పట్టణవాసుల కోసం 2022 సెప్టెంబర్ 2న ప్రభుత్వం బస్తీ దవాఖాన మంజూరు చేస్తూ సర్క్యూలర్ జారీ చేయడంతోపాటు రూ.13.20 లక్షలు మంజూరు చేసింది. నాటి నుంచి మున్సిపాల్టీ నుంచి స్థల సేకరణ చేస్తున్నామని అధికారులు చెబుతూనే ఉన్నారు. పలు స్థలాలను ఎంపిక చేయడం, కాన్సల్ చేయడం పరిపాటిగా మారింది. చివరకు పూర్తి స్థాయిలో స్థలాన్ని, భవనాన్ని కేటాయించకపోవడంతో రెండేళ్లు గడచినా బస్తీ దవాఖానా ఏర్పాటుకు మోక్షం రాలేదు.

పలు స్థలాలు ఎంపిక...?

బస్తీ దవాఖానా ఏర్పాటు కోసం పట్టణంలోని సర్వాపురం శివారులోని గ్రామపంచాయతీ భవనాన్ని అప్పగిస్తారని ప్రచారం జరిగింది. అనంతరం వల్లబ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తారన్న వ్యాఖ్యలూ వినవచ్చాయి. అక్కడా కాన్సల్ చేశారు.

వైరాలజీ ల్యాబోరేటరీ భవనంలో..

పట్టణంలో కోవిడ్-19 పరీక్షలు చేసేందుకు ఇబ్బందులు పడిన క్రమంలో 2022 ఫిబ్రవరిలో ప్రభుత్వం వైరాలజీ ల్యాబొరేటరీ మంజూరు చేసింది. అలాగే రూ.1.50 కోట్ల వ్యయంతో పరికరాలను అందజేసింది. సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఏసీలు బిగిస్తే ల్యాబొరేటరీని ప్రారంభించవచ్చని అన్నారు. అలా కాకుండా ఆ భవనంలోనే బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నట్టు ప్రచారంలో ఉంది. అలా చేస్తే వైరాలజీ ల్యాబొరేటరీలోని పరికరాలు వృథా అయ్యే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వైరాలజీ ల్యాబొరేటరీ కాకుండా మరో భవనాన్ని కేటాయించి త్వరలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది సైతం నియామకం

బస్తీ దవాఖాన కోసం ప్రభుత్వం ఫార్మాసిస్టును కేటాయించగా ప్రస్తుతం చెన్నారావుపేట పీహెచ్‌సీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అలాగే స్టాఫ్ నర్సును నియమించగా దుగ్గొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను జిల్లా ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై పంపించారు.



త్వరలోనే ఏర్పాటు కానుంది



త్వరలోనే బస్తీ దవాఖానా ఏర్పాటు కానుంది. నర్సంపేటకు 2022లో బస్తీ దవాఖానా మంజూరైనా స్థలం, భవనం లేకపోవడంతో ఇంకా ఏర్పాటు చేయలేదు. ఇటీవల మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాం. త్వరలో భవనాన్ని కేటాయించి బస్తీ దవాఖానాను ప్రారంభిస్తాం.

–డాక్టర్ అరుణ్‌చంద్ర, వైద్యాధికారి



రాయపర్తి : మండల ప్రజాపరిషత్ స్కూల్లో బొడ్డెమ్మ పండుగలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేడుకగా బొడ్డెమ్మ నిమజ్జనం



నల్లబెల్లి : బొడ్డెమ్మతో మహిళలు



చెన్నారావుపేట : ఎల్లాయగూడెంలో..

రాయపర్తి/నల్లబెల్లి/చెన్నారావుపేట : రాయపర్తి, నల్లబెల్లి, చెన్నారావుపేట మండలాల్లో బొడ్డెమ్మను వేడుకగా నిమజ్జనం చేశారు. రాయపర్తిలోని ఎంపీపీఎస్ స్కూల్లో బొడ్డెమ్మ వేడుకలు నిర్వహించగా నల్లబెల్లిలో బొడ్డెమ్మను గ్రామ ప్రధాన వీధుల మీదుగా ప్రదర్శనగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెంలో కందికొండ అశోక్–శకుంతల ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన బొడ్డెమ్మను గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



సంగెం : సింధూప్రియను అభినందిస్తున్న హెచ్ఎం



నెక్కొండ : విద్యార్థులతో కరస్పాండెంట్, టీచర్లు

సంగెం : మండలంలోని మొండ్రాయిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సింధూప్రియ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ, పీడీ ముఖర్జీ తెలిపారు. పాఠశాల ఆవరణలో సింధూ ప్రియను హెచ్ఎం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. గత నెల 29న హనుమకొండలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–14 బాలికల రెజ్లింగ్ పోటీల్లో సింధూ ప్రియ మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈనెల 3 నుంచి 5 వరకు నారాయణపేట జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సింధూ ప్రియ పాల్గొంటుందని తెలిపారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలకు..

నెక్కొండ : ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి పోటీల్లో మండంలోని విద్యోదయ గురుకుల స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి తెలిపారు. సదరు విద్యార్థులను కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడారు. గత నెల 27, 28 తేదీల్లో జరిగిన పోటీల్లో కబడ్డీ టీమ్ ప్రతిభ చాటి ప్రథమ బహుమతి గెలుచుకుందని తెలిపారు. అలాగే జిల్లా స్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో బాలుర జట్టులో సిద్ధు, నిఖిల్, అఖిల్, బాలికల జట్టులో యమున, దివ్య, ఖోఖో అండర్–14 బాలుర విభాగంలో జట్టులో రిత్విక్, రాజు, రాహెల్, బాలికల జట్టులో హిమబిందు, సరస్వతి ప్రతిభ చాటి ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ షరీఫ్, పీఈటీ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, నెక్కొండ, దుగ్గొండి, ఖానాపురం, సంగెం, గీసుకొండ, రాయపర్తి, పర్వతగిరి, తదితర మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. ఆటపాటలు, కోలాటాలతో బతుకమ్మ ఆడి సందడి చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు.

–సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట :ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



నర్సంపేట : కాకతీయ కళాశాలలో..



పర్వతగిరి : విజ్‌డమ్ స్కూల్‌లో..



ఖానాపురం: బతుకమ్మలతో విద్యార్థులు, టీచర్లు



రాయపర్తి : లహరి పబ్లిక్‌స్కూల్‌లో..



చెన్నారావుపేట : కేజీబీవీలో..



దుగ్గొండి : న్యూవిజన్ హైస్కూల్‌లో..



సంగెం : కాపులకనపర్తి ప్రభుత్వ హైస్కూల్‌లో..



నెక్కొండ : గౌతమి పాఠశాలలో..



నల్లబెల్లి : కారుణ్య జ్యోతి హైస్కూల్‌లో..

రుణమాఫీ కోసం రైతులు పోరాడాలి

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రాయపర్తి : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట/రాయపర్తి: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేసే వరకు రైతులు పోరాడాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామ పద్మశాలి భవన్‌లో వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలు, రాయపర్తి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.రుణమాఫీ కోసం వర్ధన్నపేట, తొర్రూరులో నిర్వహించనున్న ధర్నాకు రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. కేసీఆర్‌ను ఎందుకు సీఎం చేసుకోలేకపోయామని ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌వి 420 హామీలని ఎద్దేవా చేశారు. వర్ధన్నపేటలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఆత్మ మాజీ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, రాయపర్తిలో జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహానాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వర్ధన్నపేట : గుడులు కడితే బిచ్చగాళ్లు తయారవుతారంటూ స్థానిక ఎమ్మెల్యే నాగరాజు చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగరాజు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్, కుమారస్వామి మాట్లాడారు. హిందువుల మనోభావాలను కించపర్చేలా చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే నాగరాజు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కులాల, మతాల నడుమ చిచ్చుపెట్టేలా ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు కుందూరు మహేందర్‌రెడ్డి, కొండేటి సత్యం, ఐత రవి, శ్రావణ్‌కుమార్, చెంగల సురేశ్, దేవేందర్‌రావు, నాంపల్లి యాకయ్య, గోపి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

నర్సంపేట రూరల్ : ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి, రామవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాలకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులాల, మతాల నడుమ చిచ్చు పెడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలును విస్మరించిందని ధ్వజమెత్తారు. సమావేశాల్లో నాయకులు ఈసంపెల్లి బాబు, సమ్మయ్య, కుమారస్వామి, రాజులపాతి సూరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన బరుపట్ల కట్టమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే 50 కిలోల బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వట్టె తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయించొద్దు

నర్సంపేట : గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలో నేడు (బుధవారం) మటన్, చికెన్, చేపలు విక్రయించొద్దని మున్సిపల్ కమిషనర్ జోన తెలిపారు. పట్టణంలోని చికెన్, మటన్, చేపల విక్రయ దుకాణాల యజమానులు, హోటళ్ల నిర్వాహకులకు మంగళవారం నోటీసులు అందజేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

సురేఖపై బీఆర్‌ఎస్ వైఖరిని ఖండిస్తున్నాం



వరంగల్ : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుల, ఆ పార్టీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. హనుమకొండలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఒక సోదరికి, సోదరుడికి ఉండే సంబంధాన్ని కూడా తప్పుపట్టడం సిగ్గు చేటని, బీఆర్‌ఎస్ నేతలకు అక్కా–చెల్లెల్లు, తల్లీ–బిడ్డలు లేరా అని ప్రశ్నించారు. ఒక ఆడబిడ్డపై తప్పుడు ప్రచారం చేయడాన్ని యావత్ మహిళాలోకం ఖండిస్తున్నదన్నారు. తక్షణమే భేషరతుగా క్షమాపణ చెప్పాలని లేకుంటే బీఆర్‌ఎస్ నేతలను ప్రజాక్షేత్రంలో తిరగనివ్వమని చెప్పారు.

డీఎస్సీలో శ్రీనివాస్ ప్రతిభ



నెక్కొండ: చిన్నతనంలోనే తల్లిని కోల్పోయినా ఆత్మస్థైర్యం వీడలేదు. కష్టపడి చదివి ప్రభుత్వ కొలువు సాధించాడు బండి శ్రీనివాస్. మండలంలోని రెడ్లవాడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) జిల్లాలో ఐదో ర్యాంకు సాధించాడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో పీజీ (ఎకనామిక్స్) పూర్తి చేసి ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పోటీ పరీక్షలకు ప్రిపేరై టీచర్ ఉద్యోగం సాధించాడు. లక్ష్యంతో చదివితే కొలువు కొట్టవచ్చని శ్రీనివాస్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

అక్రమ పట్టాను రద్దు చేయాలి

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరికి చెందిన సముద్రాల సుదర్శనాచార్యులు అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేయాలని మాజీ సర్పంచ్‌లు మాదారపు భాస్కర్, బొమ్మనపల్లి గణేశ్, మాదారపు చంద్రయ్య, ఎంపీటీసీలు బూడిద పెద్ద వెంకన్న, పర్కాల లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. సుదర్శనాచార్యులుకు 15 గుంటల భూమి మాత్రమే ఉండగా సర్వే నంబర్ 302/1/3, 305/1, 305/ 2, 305/3, 305/4, 305/5. 311/1, 311/3ల్లో పట్టాలో 4.9 ఎకరాల గుంటలు పట్టా చేయించుకున్నాడని తెలిపారు. రైతుబంధు డబ్బులు తీసుకుని ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే సర్వే చేసి అదనంగా ఆక్రమించుకున్న భూమిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మల్లం సాగర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మేడం కుమారస్వామి, గ్రామస్తులు మంద వేణు, చిన్న సోమయ్య, తాడెం ప్రభాకర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమం సామాజిక బాధ్యత



వృద్ధులకు కార్డులు అందజేస్తున్న తహసీల్దార్

చెన్నారావుపేట : వృద్ధుల సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి అభివర్ణించారు. మండల కేంద్రంలోని జాగృతి స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి వారు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. వృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్కరించడానికి అందుబాటులో ఉంటామని చెప్పారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ మాట్లాడుతూ వృద్ధుల కోసం డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య మాట్లాడుతూ సంఘంలో 120 మంది సభ్యులుండగా 50 మందికి ప్రస్తుతం కార్డులు అందిస్తున్నట్టు తెలిపారు. ఎస్సై రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి మాట్లాడుతూ వృద్ధుల కోసం తన సొంత డబ్బుతో గది నిర్మించి ఇస్తానన్నారు. అనంతరం 80 ఏళ్లకుపైబడిన వయస్సు కలిగిన సలేంద్ర భాగయ్య, కేతిడి సమ్మిరెడ్డి, తోట ఆనందం, నాంపెల్లి చంద్రయ్య, వనపర్తి కొమురయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి వరంగంటి కుమారస్వామి, నాయకులు మల్లయ్య, సంజీవ రెడ్డి, ముత్యం సాంబయ్య, గట్ల కృష్ణయ్య, నారాయ ణెడ్డి, పరకాల కొమురయ్య, తాళ్లపెల్లి కొమ్మాలు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఆర్' ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ

రాయపర్తి : ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెర్కవేడులో మహిళలకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి మధూకర్‌రెడ్డి మాట్లాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాస్‌రెడ్డి బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలను గౌరవించేలా చీరలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సేవా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, సంది అమ్మి దేవేందర్‌రెడ్డి, యూసుఫ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తగిన నష్టపరిహారం ఇప్పించాలని వినతి

పర్వతగిరి : మార్కెట్ విలువకు అనుగుణంగా తగిన నష్టపరిహారం ఇప్పించాలని మండలంలోని ఏనుగల్, చింతనెక్కొండ గ్రామాలకు చెందిన గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధితులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యేను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితులు సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సింగులాల్, నాయకులు ధంశెట్టి నర్సింగం, నల్లపు దేవేందర్, లక్కర్సు సాంబయ్య, నల్ల భిక్షపతి, బుక్క దేవేందర్, కానుగంటి రవి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.